
ఒంగోలులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి


స్వామి వారి ఆశీర్వాదం అందుకుంటున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున


అగ్రహారంలో పూజలు చేస్తున్న కౌన్సిలర్ గంగయ్య

వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే లడ్డూ వివాదం

- దేవుడిని అడ్డం పెట్టుకుని నీచ రాజకీయాలు చేస్తున్న సీఎం చంద్రబాబు
- మాజీ మంత్రి మేరుగు నాగార్జున ఆగ్రహం

మద్దిపాడు:

కూటమి ప్రభుత్వం నాలుగు నెలల పాలనలో ప్రతి విషయంలో వైఫల్యం చెందిందని, వాటిని కప్పిపుచ్చుకోవడానికే టీటీడీ లడ్డూ వివాదానికి ఉద్దేశపూర్వకంగా తెరతీసిందని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి దేవుడిని అడ్డం పెట్టుకుని నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. తిరుమల లడ్డూ ప్రసాదంపై, తిరుమల పవిత్రతపై కూటమి ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ సీఎం హోదాలో చంద్రబాబు చేసిన పాపం ప్రక్షాళన కావాలని కోరుతూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శనివారం మద్దిపాడు మండలం మల్లవరం లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి మేరుగు నాగార్జున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేరుగు మాట్లాడుతూ వరదల్లో విజయవాడ కొట్టుకుపోతున్నా కనీసం ప్రజలను ప్రభుత్వం అప్రమత్తం చేయకపోవడంతో పలువురు చనిపోయారన్నారు. వంద రోజుల పాలనలో ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఈ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి తిరుపతి లడ్డూలో ఏదో కలిసిపోయింది.. అంతా మాజీ సీఎం వైఎస్ జగనే చేశారంటూ చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నారని మేరుగు విమర్శించారు. ఎన్‌డీడీబీకి టీటీడీ దేవస్థానం నుంచి ఎప్పుడైనా శాంపిల్స్ వెళ్లాయా.. ఆ బోర్డు చైర్మన్‌కి-ముఖ్యమంత్రికి ఉన్న లింకు ఏమిటో ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు. చంద్రబాబు నోటి వెంట అభూత కల్పనలు తప్ప మరో విషయం రావడం లేదన్నారు. లేని దానిని ఉన్నట్లు.. ఉన్నదానిని లేనట్లు చేయడంలో ఆయనను మించిన వారు లేరన్నారు. ఈ క్రమంలో చంద్రబాబు, ఆయన టీం దేవుడి ప్రతిష్టను సైతం దెబ్బతీసేవిధంగా కుట్రలు, కుతంత్రాలతో దుష్ప్రచారం చేస్తున్నారని మేరుగు మండిపడ్డారు. దేవునికి మకిలి పూస్తున్న చంద్రబాబుకు ఆ దేవుడే శిక్ష విధించాలని, అతనికి మంచి బుద్ధి ప్రసాదించాలని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అదే విధంగా ప్రజల పక్షాన నిలిచి అందరికీ మంచి చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆ దేవదేవుని ఆశీసులు ఎల్లప్పుడూ అందించాలని కోరుకున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మద్దిపాడు మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, సంతనూతలపాడు అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, నాయకులు పమిడి వెంకటేశ్వర్లు, పోలినేని కోటేశ్వరరావు ఎంపీపీలు వాకా అరుణ కోటిరెడ్డి, యద్దనపూడి శ్రీనివాసరావు, నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, మారెళ్ల బంగారుబాబు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇనగంటి పిచ్చిరెడ్డి, వేమా శ్రీనివాసరావు, గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మోరబోయిన సంజీవరావు, గుడ్డపాతల రవి, దుంపా ఎలమందారెడ్డి, తేళ్ల పుల్లారావు, పైడిపాటి వెంకట్రావు, రామాంజనేయులు, ప్రసన్నాంజిరెడ్డి, బాలాంజనేయరెడ్డి, సత్యన్నారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి, పిట్టల ఆంజనేయులు, శింగయ్య, హరిబాబు, సుబ్బయ్య, మల్లవరం సర్పంచ్ నారా సుబ్బారెడ్డి, మాజీ డైరెక్టర్ కంచర్ల సుధాకర్, మాదాసు రాంబాబు, ఇనగంటి రమణారెడ్డి, కుమ్మారి సుధాకర్, జట్టి శ్రీను, మద్దిరాల సుబ్బారావు, ఇమ్మిశెట్టి బాలకృష్ణ, యాదాల నాగరాజు, పాలేరు నాగేశ్వరరావు, పొద పవన్, పల్లెర్ల అంజిరెడ్డి, ప్రసన్న కుమార్, నందిపాడు సర్పంచ్ అరుణశ్రీకాంత్, నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సంతపేట సాయిబాబా సన్నిధిలో పూజలు చేస్తున్న చెవిరెడ్డి భాస్కర రెడ్డి, నేతలు


మల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, వైఎస్సార్ సీపీ నాయకులు


విఘ్నేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అగ్రహారంలో కౌన్సిలర్ పూజలు

చీమకుర్తి: చీమకుర్తి మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య శనివారం అగ్రహారంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. టీటీడీ లడ్డూ వివాదం సృష్టించి నీచ రాజకీయం చేస్తున్న సీఎం చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ పూజలు నిర్వహించి స్వామివారి ఆశీర్వాదాలు స్వీకరించారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు బుద్ధి రావాలి

ఒంగోలు: స్థానిక నెల్లూరు బస్టాండులోని విఘ్నేశ్వరాలయంలో వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో శనివారం నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొబ్బరికాయలు కొట్టి రాష్ట్ర ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించి రాష్ట్రానికి మేలు జరిగేలా చేయాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి బొట్ల రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రతిపక్షంపై విషం చిమ్ముతోందని విమర్శించారు. చివరకు దేవదేవుడ్ని సైతం వెంకన్న చౌదరిగా పేర్కొన్నవారు.. నేడు వారి రాజకీయ ప్రయోజనాల కోసం చివరకు లడ్డూలో జంతు అవశేషాలు కలిశాయంటూ దేవదేవుడి ప్రసాదంపైన తప్పుడు ప్రచారం చేయడంతో నేడు అంతర్జాతీయ వ్యాప్తంగా భక్తులు మండిపడుతున్నారన్నారు. కేవలం విజయవాడలో వచ్చిన వరదలను ఎదుర్కోవడంలో విఫలం కావడం, వంద రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక అబద్ధపు వాగ్దానాలతో గద్దెనెక్కిన చంద్రబాబు కుయుక్తులతో లడ్డూ ప్రసాదంపై విమర్శలు గుప్పిస్తున్నారని విమర్శించారు. ఇటువంటి వారిని భగవంతుడు క్షమించరని, పక్కదారిపట్టించే రాజకీయ నాయకుల కుట్రలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలన్నారు. 14వ డివిజన్ కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్ మాట్లాడుతూ వందరోజుల్లో ఎటువంటి హామీలు నెరవేర్చలేక ఇటువంటి తప్పుడు ప్రచారాలకు పాల్పడటం సరికాదన్నారు. చంద్రబాబు అండ్‌కోకు భగవంతుడు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ కొబ్బరికాయలు కొట్టామన్నారు. రాష్ట్ర కార్యదర్శి చావలి శివ మాట్లాడుతూ చంద్రబాబు పాలనపై ప్రజలు ఇప్పటికే విసిగిపోయారన్నారు. మభ్యపెట్టి గద్దెనెక్కిన తరువాత హామీలను గాలికొదిలివేయడమే కాకుండా ఆ సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. నాణ్యత తక్కువగా ఉంటే నెయ్యి ట్యాంకర్లను వెనక్కి తిప్పి పంపిన ఘనత గతంలో తమ హయాంలో కూడా జరిగిందని, కానీ దానిని పక్కదారి పట్టిస్తూ చివరకు లడ్డూ ప్రసాదంపై కూడా విష ప్రచారానికి పాల్పడి భక్తుల మనోభావాలను దెబ్బతీయడం క్షమించరాని పాపం అన్నారు. తాజాగా జగన్ తిరుమలకు వెళ్లడానికి డిక్లరేషన్ ఇవ్వాలంటూ మరో పక్కదారి పట్టించే అంశాన్ని వెలుగులోకి తీసుకురావడాన్ని ప్రజలంతా చూస్తున్నారన్నారు. ఇటువంటి చర్యలకు ప్రజలే సమాధానం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కటారి ప్రసాదు, దాసరి కరుణాకర్, గంటా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నం: ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలో పూజలు జరిగాయి. ఆలూరు, గాదెపాలెం, రంగాయపాలెం, ఈతముక్కల, అల్లూరు, రాజుపాలెం గ్రామాల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


గాదెపాలెం రాముడు ఆలయంలో పూజలు

క్లుప్తంగా

ఎంపీపీని కలిసిన ఎంపీడీఓ


ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డితో ఎంపీడీఓ జ్యోతి

మద్దిపాడు: ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డిని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ వీ జ్యోతి శనివారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో కలిశారు. ఎంపీపీ దంపతులకు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు తీసుకుందామని, ఆ దిశగా అందరినీ కలుపుకుని పోదామని కోరుతూ ఎంపీడీఓకి అభినందనలు తెలిపారు. నందిపాడు సర్పంచ్ అరుణశ్రీకాంత్ ఎంపీడీఓను కలిసి సత్కరించి అభినందనలు తెలిపారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్


విద్యార్థులతో మాట్లాడుతున్న హుస్సేన్

చీమకుర్తి: గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జాతీయ స్థాయిలో కృషి చేస్తున్నట్లు జాతీయ షెడ్యూల్ తెగల (ఎస్టీ) కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్ అన్నారు. శనివారం చీమకుర్తి గరికమిట్టలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా గిరిజనుల సమస్యల గురించి తెలుసుకోవడానికి ఇప్పటికే 12 రాష్ట్రాల్లో పర్యటించినట్లు తెలిపారు. మన రాష్ట్రంలో 9 జిల్లాల్లో పర్యటించినట్లు చెప్పారు. చీమకుర్తి గిరిజన గురుకుల బాలుర హాస్టల్ విద్యార్థులకు అందిస్తున్న విద్యా ప్రమాణాలు, తరగతి గదులు, హాస్టల్ భవన నిర్మాణాలను పరిశీలించారు. గిరిజన కాలనీలలో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా తెలుసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషన్ డైరెక్టర్ కల్యాణ్‌రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి జగన్నాథరావు, స్థానికులు పాల్గొన్నారు.

పేద యువతి పెళ్లికి చేయూత

ఒంగోలు టౌన్: పేద యువతి పెళ్లికి స్థానిక సూర్యశ్రీ ట్రస్ట్ చేయూతనందించింది. పెద్దారవీడు మండంలోని దేవరాజుగట్టుకు చెందిన బూడిదల జకరయ్య, సుధారాణి దంపతులిద్దరు దివ్యాంగులు. కూతురు వివాహం కోసం సామాజిక మాధ్యమాల ద్వారా సూర్యశ్రీ ట్రస్ట్ వివరాలు తెలుసుకొని సాయం కోసం అర్థించారు. వెంటనే స్పందించిన ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్ ఆ అమ్మాయి వివాహం కోసం 60 వేల రూపాయలను శనివారం ఆ దంపతులకు అందజేశారు.

అట్రాసిటీ కేసుల్లో రిలీఫ్ ఇవ్వాలి


హుస్సేన్ నాయక్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న గిరిజన నాయకులు

ఒంగోలు: జిల్లా పర్యటనలో భాగంగా ఒంగోలుకు విచ్చేసిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌ను స్థానిక ఎస్ఎస్‌పీ అతిథి గృహంలో బహుజన గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గంటా సుబ్బారావు, లక్కెపోగు వెంకట్రావులు పుష్పగుచ్ఛం అందించి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో గత రెండు సంవత్సరాల నుంచి రిలీఫ్ విడుదల కాలేదని, దానివల్ల బాధితులు మనోధైర్యం కోల్పోతున్నారన్నారు. దీనిపై సత్వరమే బాధితులకు న్యాయం జరిగేలా జిల్లా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ బాలాజీ నాయక్, గిరిజ నాయకులు రాపూర్ శ్రీనివాసులు, చల్లా శ్రీధర్‌బాబు, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ఒంగోలు నగరంలో ఫుడ్ స్ట్రీట్

- 31 స్టాళ్ల ఏర్పాటుకు నగర పాలక సంస్థ కసరత్తు


ఫుడ్ స్ట్రీట్ ప్రాంగణంలో మార్కింగ్ పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర రావు

ఒంగోలు సబర్బన్: ఒంగోలులో ప్రత్యేకంగా నగర పాలక సంస్థ ఫుడ్ స్ట్రీట్‌ను ఏర్పాటు చేయనున్నారు. నగరంలో ఫుడ్ స్ట్రీట్ ఏర్పాటు చేయాలని నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ప్రణాళికలు సిద్ధం చేశారు. దీంతో నూతనంగా వచ్చిన కమిషనర్ డాక్టర్ కోడూరు వెంకటేశ్వర రావు.. రంగారాయుడు చెరువుకు ఉత్తరం వైపున రజక సంఘానికి ఇచ్చిన స్థలంకు ఆనుకొని ఈ ఫుడ్ స్ట్రీట్‌ను ఏర్పాటు చేయటానికి నిర్ణయించారు. రజక సంఘం నాయకులు వారి స్థలానికి చుట్టూ ప్రహరీ నిర్మించుకున్నారు. ఆ గోడకు ఆనుకొని తూర్పు వైపున ఫుడ్ స్ట్రీట్ కోసం ఏర్పాట్లు చేశారు. శనివారమ స్థలం శుభ్రం చేయించిన కమిషనర్ వెంకటేశ్వర రావు ఫుడ్ స్ట్రీట్‌లో ఏర్పాటు చేయనున్న షాపులకు దగ్గరుండి మార్కింగ్ చేయించారు. మొత్తం 31 షాపులు వచ్చేవిధంగా రూపకల్పన చేశారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మేయర్ జీ.సుజాత ఫుడ్ స్ట్రీట్ ప్రాంగణాన్ని శనివారం పరిశీలించారు.

మహనీయులకు నివాళి


జిల్లా గ్రంథాలయంలో భగత్ సింగ్, గుర్రం జాషువా జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న దృశ్యం

- ఘనంగా గుర్రం జాషువా, భగత్ సింగ్ జయంతి వేడుకలు

ఒంగోలు టౌన్: తెల్ల దొరలను వణికించిన అమర వీరుడు షహీద్ భగత్ సింగ్, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువాలకు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నివాళులర్పించారు. శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మాట్లాడుతూ చిరుప్రాయంలోనే తెల్లదొరలను వ్యతిరేకించి, ఉరికొయ్యను ముద్దాడిన భగత్ సింగ్ చరిత్రలో సూర్యచంద్రులున్నంత కాలం నిలిచిపోతారని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి కొనియాడారు. అంటరానితనం, అసమానతలపై తనదైన శైలిలో కవిత్వాయుధాన్ని ఎక్కుపెట్టి పోరాడిన యుగకర్తగా గుర్రం జాషువా స్ఫూర్తి ఎప్పటికీ నిలిచి ఉంటుందని చెప్పారు. ఈ ఇరువురు మహనీయులు ఒకేరోజు పుట్టడం కాకతాళీయమని, వారి భావాలు కూడా ఒకటే కావడం చాలా అరుదైన విషయమని పేర్కొన్నారు. ఆధునికాంధ్ర సాహిత్యంలో తొలితరం కవుల్లో జాషువా అగ్రగణ్యుడని, సమసమాజం కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడని ప్రశంసించారు. ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మిడసల మల్లికార్జునరావు, సంతవేలూరి కోటేశ్వరరావు, షిరిడీ సాయిరాం, కె. సంపూర్ణమ్మ, శాంసన్, మృదుల్, అనిల్ కుమార్, ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళులు

చీమకుర్తి: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో భగత్‌సింగ్‌కు శనివారం ఘనంగా నివాళులర్పించారు. భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. భగత్‌సింగ్ పేరు మీద చేస్తున్న సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాజు, వాసుబాబు, ప్రవీణ్, పుష్పరాజ్, తేజ, అభిరామ్ పాల్గొన్నారు.


చీమకుర్తిలో జాషువాకు నివాళులర్పిస్తున్న కౌన్సిలర్ గంగయ్య

గుర్రం జాషువాకు ఘన నివాళులు

చీమకుర్తి: ఆధునిక తెలుగు కవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య శనివారం చీమకుర్తి క్రిస్టియన్‌పాలెంలో ఘనంగా నివాళులర్పించారు. జాషువా రచనలు, సామాజిక చైతన్యంపై ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. జాషువా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాటిబండ్ల సులోచన, శారద, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి

ఒంగోలు మెట్రో: స్థానిక ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూం ఆవరణంలో శనివారం నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవయుగ కవి చక్రవర్తి, విశ్వకవి, కవికోకిల గుర్రం జాషువా 129వ జయంతి సభ ఘనంగా నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు మిడసల మల్లికార్జున రావు నిర్వహణలో కార్యదర్శి కనమాల రాఘవులు అధ్యక్షతన జరిగింది. సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ గుర్రం జాషువా తెలుగు సాహితీ పూతోటలో విర బూసిన సాహితీ సుగంధ పుష్పమన్నారు. ఆయన పేరు వింటేనే మల్లెలు సుగంధ పరిమళాల్ని వెదజల్లుతాయని, ఆయన కవిత్వమే ఆయుధంగా మూఢాచారాలపై తిరగబడ్డ మహాకవి అని పేర్కొన్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ సంఘ సంస్కరణే ఆయన కావ్య లక్షణాలని, వర్గ సంఘర్షణ, ఆర్థిక ఉద్దేశాలు, దోపిడీ వర్గాలపై తిరుగుబాటు చేసిన అభ్యుదయ వాదని ప్రశంసించారు. కళామిత్ర మండలి (తెలుగు లోగిలి) సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు ప్రసంగిస్తూ జాషువా తన జీవితాన్ని శాశ్వత సత్యాలను, నవత్వాన్ని చెప్పే దిశగా నడిపించిన వ్యక్తని, ఆయన కు జీవితం ఎన్నో పాఠాలు నేర్పిందని తెలిపారు. శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రాప్రసాద్ బాబు, జాషువా గురించి వివరిస్తూ ఆవేదన భరితమైన హృదయంతో పద్యమై, గర్జించి తన స్వర ప్రభంజనాన్ని వినిపించారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పరాంకుశ కేశవాచార్యులు రాయపాటి ఆశీర్వాదం, సుబ్బారావు, ఆపరేటర్ వెంకటేశ్వర్లు, గుంటూరు సత్యనారాయణ, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, నూకతోటి శరత్ బాబు, శాంతారావు, ఐ.నరసింహారావు, కోప్పోలు వెంకటేశ్వర్లు, అజీజ్, తదితరులు పాల్గొన్నారు.


భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐపై నాయకులు


సీవీఎన్ రీడింగ్ రూంలో గుర్రం జాషువా జయంతి వేడుకలు

స్కిల్ సెంటర్‌లో శిక్షణ ప్రారంభిస్తాం


వెంకటేశ్వర కాలనీలో నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర రావు

ఒంగోలు సబర్బన్: నగరంలో ఏర్పాటు చేసిన స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్‌లో శిక్షణను త్వరలో ప్రారంభిస్తామని ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కోడూరు వెంకటేశ్వర రావు చెప్పారు. ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, పారిశుధ్య విభాగాల అధికారులతో కలిసి శనివారం పలు డివిజన్లలో పర్యటించారు. బైపాస్ రోడ్ లో బైక్ షో రూమ్ ఎదురుగా వున్న కాలువలో నీటి పారుదల సక్రమంగాలేకుండా ఉండటం గమనించి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు.. వెంటనే నీరు నిల్వ ఉండకుండా చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సబ్ స్టిట్యూటెడ్ సర్వీసు నోటీసు

మా క్లయింటు చుండూరి సరస్వతి W/o లేటు **మిరియాల సుబ్బారావు** మిరియాలపాలెం, ఒంగోలు అను వారి నుండి సంజాయిషీ పొంది యిందువెంట యిచ్చిన సబ్ స్టిట్యూటెడ్ సర్వీసు.

టు...

బచ్చు జాలరావు, మూదవప్రతివాది గోపాల్‌నగర్, ఒంగోలు.

మా క్లయింటు చీరాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో O.S. No. 447/22 తాలుకా **చుండూరి సాంబయ్య** S/o లేట్ **బాలయ్య** తదితరుల పై దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీరూ అనగా **బచ్చు జాలరావు** మూడవ ప్రతివాది అయి ఉన్నారు. మీకు సబ్ స్టిట్యూటెడ్ సర్వీసు ద్వారా సదరు సమన్‌లు జారీ చేయుటకు ఉత్తర్వులు పొంది యిందువెంట మీకు సమన్‌లు పేపరు ప్రకటన ద్వారా జారీ చేయుచు దీ. **05-11-2024**న ఉదయం గం॥**10-30**ని॥కు హాజరయి పై కేసులో మీకు అక్షేపణలు ఏమైనా ఉన్న యెడల స్వయముగా కాని న్యాయవాది గారి ద్వారా గాని తెలియజేయవలసినదిగా యిందు వెంట కోరడమైనది.

యం.వి. చలపతిరావు
పి. శీతాప్రసన్న, అడ్వకేట్స్,
చీరాల. సెల్: 99858 54833

దాతల అవసరం లేకుండానే రక్త సరఫరా

ఒంగోలు టౌన్: అత్యవసర సమయాల్లో దాతలు అవసరం లేకుండానే రక్తం అందించనున్నట్లు రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు కన్వీనర్ మంగళగిరి నరసింహరావు తెలిపారు. ఇప్పటి వరకు అత్యవసర సమయాల్లో రక్తం కోసం వచ్చేవాళ్లు దాతలను కూడా వెంట బెట్టుకొని వచ్చేవారని, ఇప్పుడటాంటి అవసరం లేకుండానే ఇవ్వడానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఆధునిక వైద్య పరికరాలతో కొత్తకూరగాయల మార్కెట్‌లోని రెడ్ క్రాస్ భవనంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న బ్లడ్ బ్యాంకు ఆవరణలో శనివారం మాట్లాడారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రకాశ్ బాబు మాట్లాడుతూ నూతన బ్లడ్ బ్యాంకు ఆధునికీకరణ కోసం రెడ్ క్రాస్ జాతీయ కమిటీ సహాయంలో మూడు కోట్ల రూపాయలను సమకూర్చుకున్నట్లు తెలిపారు. విపత్కర పరిస్థితుల్లో రెడ్ క్రాస్ ముందు ఉంటుందని, ఇటీవల విజయవాడలో వరదలు వచ్చినప్పుడు కూడా అండగా నిలిచామన్నారు. సీనియర్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, రెడ్ క్రాస్ వైద్యాధికారి డాక్టర్ చెరుకూరి రవి, డాక్టర్ కృష్ణ, డాక్టర్ సుబ్బారావు, ఐఎంఏ రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ జాలాది మణిబాబు, మేనేజింగ్ కమిటీ సభ్యులు ప్రసన్న రాజు, ఇక్బాల్, న్యామత్, ఢిల్లీ పవన్, ఎం. సుబ్బారావు, వీవీ రెడ్డి, కత్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


వైద్య పరికరాల పనితీరు వివరిస్తున్న డాక్టర్ కృష్ణ, డాక్టర్ జాలాది మణిబాబు

దివ్యాంగులకు నగదు, శ్నాక్స్ పంపిణీ

కొత్తపట్నం: మదర్ థెరెస్సా హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులోని వికలాంగుల వసతి గృహంలో అల్పాహారం పంపిణీ చేశారు. హెల్పింగ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు డి.కేశవ సోదరుడు డాక్టర్ చెన్నకేశవులు.. వారి కుమారుడు విరాట్ కేశవ్ పుట్టినరోజు సందర్భంగా సహాయం చేశారు. వికలాంగులు హెల్పింగ్ టీమ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. డి.కేశవ, ఎం.సునీల్, ఎం.ప్రసాద్, ఎం.ప్రేమ్‌కుమార్, డి.రజిత్ పాల్గొన్నారు.


నగదు, శ్నాక్స్ పంపిణీ చేస్తున్న కేశవ

ప్రపంచ ఉద్యమాల్లో విద్యార్థులే కీలకం


సమావేశంలో ప్రసంగిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ హరి ప్రీతం

ఒంగోలు టౌన్: ప్రపంచ గతిని మార్చేందుకు జరిగిన అనేక పోరాటాల్లో విద్యార్థులే కీలక పాత్ర పోషించారని ఆంధ్ర కేసరి యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మండే హర్ష ప్రీతమ్ దేవ్ కుమార్ అన్నారు. స్థానిక మాదాల నారాయణ స్వామి భవనంలో శనివారం జరిగిన ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జనరల్‌బాడీ సమావేశంలో మాట్లాడారు. భారత దేశంలో సహజ వనరులను ఉపయోగించుకొని విద్యార్థులు ముందుకు పోతున్నారని చెప్పారు. సామాజిక సంఘ సంస్కర్తలైన జ్యోతిరావు పూలే, డాక్టర్ అంబేడ్కర్, షహీద్ భగత్ సింగ్‌ల స్ఫూర్తితో విద్యార్థులు సమసమాజం కోసం పోరాడాలని, చదువుతో పాటు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలోని రుగ్మతలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని ఐఎఫ్‌యూ నాయకులు ఎం. రాఘవరావు సూచించారు. శాస్త్రీయ విద్యావిధానం కోసం గత 50 ఏళ్లుగా పీడీఎస్‌యూ పోరాటాలు చేస్తుందని చెప్పారు. గత రెండేళ్లుగా చేసిన పోరాటాలను సమీక్షించుకోవడం ద్వారా భవిష్యత్తు పోరాటాలకు ప్రణాళిక సిద్ధం చేసుకునేందుకే సమావేశం నిర్వహించినట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. రాజశేఖర్ తెలిపారు. ప్రకాశం జిల్లాలో ఉన్న ఏకైక యూనివర్శిటీకి 100 కోట్ల రూపాయల నిధులను కేటాయించాలని, జిల్లాలో ఉన్న ట్రిపుల్ ఐటీకి నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడిగా సీహెచ్ శ్యాం, జిల్లా కార్యదర్శిగా జల్లి వెంకటేష్, కోశాధికారిగా వి. కోటితోపాటు మరో 13 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ప్రగతిశీల మహిళా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. పద్మ, అరుణోదయ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు చొప్పర జాలన్న, సీపీఐఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి సీఎస్ సాగర్ పాల్గొన్నారు.